ప్రజాజ్యోతి

నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం। 12 ఆగస్టు। 2025 । పేజీలు 5


## మూత్ర విసర్జనకు వెళ్లిన వ్యక్తి...

మాక్లూర్ ఆగస్టు 11 ( ప్రజా జ్యోతి ) ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోర్గం కే గ్రామానికి చెందిన సంగేవారు ప్రకాష్ (44) కుట్టు మిషన్ మెకానిక్ గా జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి మురుకు కాలువలో పడి మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.



# అడ్వాన్స్ టెక్నాలజీతో ఉజ్వల భవిష్యత్తు

### కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 11. (ప్రజాజ్యోతి) ప్రభుత్వ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశం పొంది ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మరియు ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో అడ్మిషన్ల పెంపు పై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ ఐటిఐ ట్రేడ్స్ తో పాటు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ ఏటీసీలోని నైపుణ్య ఆధారిత కోర్సులలో అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని ఆయా కోర్సుల ద్వారా యువత త్వరగా ఉపాధిని మరియు ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం అత్యధికంగా ఉన్నందున జిల్లాలోని అధిక మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేలా విశృత ప్రచారం కల్పించాలని అన్నారు. గ్రామస్థాయిలలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామస్థాయి అధికారుల సహకారంతో విద్యార్థులకు ఏటిసి కేదార్ల గురించి తెలియజేసి వాటిలో చేరేలా ప్రోత్సహించాలని జిల్లా పంచాయతీ అధికారి మురళిని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి మరియు శిక్షణ శాఖా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐ/ ఆడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్ బిచ్కుంద, తాడ్వాయి మరియు ఎల్లారెడ్డి లో ని ఆడ్వాన్సడ్ టెక్నాలజీ సెంటర్ లలో వాక్ ఇన్ అడ్మిషన్ల ప్రారంభమాయ్యాయని సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సిహెచ్ ప్రభుదాస్, ప్రిన్సిపల్ కన్వీనర్ జి.ప్రమోద్ తాడ్వాయి ప్రిన్సిపల్ ఎఫ్ ఎ సి జి కనకయ్య, ఈ మీటింగ్ కి హాజరు కావడం జరిగింది.

## పది కొత్త ఆర్టీసీ బస్సులు మంజూరు



ఎల్లారెడ్డి ఆగస్టు 11 (ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డి ప్రజల ఎన్నో ఏళ్ల కల ఎల్లారెడ్డిలో బస్ డిపో ఏర్పాటు కోసం సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ని కలిసి ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు వినతి పత్రం అందజేయగా నియోజకవర్గానికి 10 కొత్తగా ఆర్టీసీ బస్సులు మంజూరు అయ్యాయని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఐదు కోట్ల వ్యయంతో కొత్త బస్టాండ్ నిర్మించి ప్రజల వినియోగానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా జూన్ 24న నూతన ఆర్టీసీ బస్టాండ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుల సంఖ్యను పెంచాలని మంత్రిని కోరగా, స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే బాన్సువాడ కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్లకు ఎల్లారెడ్డి కి అదనపు కొత్త బస్సులను కేటాయించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కృషితో నియోజకవర్గాన్ని కొత్త బస్సులు రానున్నాయి.

# అర్జీలను పరిష్కరించాలి

### నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

### ప్రజావాణిలో 22 ఫిర్యాదులు

సిరికొండ ఆగస్టు 11( ప్రజా జ్యోతి) నిజామాబాదు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.ఎస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం 22 ఫిర్యాదులు రావడం జరిగింది. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరంఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు సలహాలు చేయడం జరిగింది.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క సి.ఐ, ఎస్ ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. తెలియజేశారు.




# శభాష్.. సునీత

భిక్కనూరు ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో 130 మంది విద్యార్థులు వసతిగృహంలో ఉండగా ,ఒక్కసారి విద్యార్థులను ప్రజా జ్యోతి పత్రిక ప్రశ్నించగా..విద్యార్థులు మాట్లాడుతూ ఉదయం టిఫిన్ ,రాత్రి వేళలో భోజనం తోపాటు, మా ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు వార్డెన్ సునీత పర్యవేక్షిస్తున్నారని, తమకు ఇంటి వాతావరణం గుర్తుకు రాకుండా చదువులో ప్రోత్సహిస్తూ ,క్రీడలలో కూడా ప్రోత్సాహం అందిస్తూ, పాఠశాలలో అర్థం కాని అంశాలను రాత్రి సమయంలో విద్యార్థులకు బోధిస్తూ, అర్థమయ్యేలా సూచనలు చేస్తున్నారని ,అన్ని విధాలుగా విద్యార్థులను క్రమశిక్షణ, విలువలతో కూడిన సూచనలు ఇస్తూ.తమను ప్రోత్సహిస్తున్నారని విద్యార్థులు తెలిపారు . నిరుపేద విద్యార్థులను తన సొంత పిల్లలుగా చూస్తూ, మంచి విద్యాబుద్ధులను అందిస్తూ, నిరంతరం విద్యార్థుల భవిత కై కృషి చేస్తున్న వార్డెన్ సునీతని ప్రజా జ్యోతి ప్రత్యేకంగా అభినందించింది.



### భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ...

# పోలీస్‌స్టేషన్‌లో యువరైతు ఆత్మహత్యాయత్నం

నాగిరెడ్డిపేట్,ఆగష్టు11(ప్రజాజ్యోతి): తన భూ సమస్యకు పరిస్కారం చూపాలని పోలీస్ స్టేషన్ లోనే యువరైతు చేయి కోసుకున్నాడు. నాగిరెడ్డిపేట్ మండంలోని మల్తుమ్మెద గ్రామానికి సిద్ధిగారి యాదగిరి తండ్రి సిద్ధిగారి రాములు అదే గ్రామానికి చెందిన కొందరి వ్యక్తుల వద్ద 2 ఎకరాల 21 గుంటల భూమిని 1997 సంవత్సరంలో కొనుగోలు చేసాడని.పాత పట్టా పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని కానీ ధరణి వచ్చిన తర్వాత తన తండ్రి కొనుగోలు చేసిన సాగు భూమి తన తండ్రి పేరిట కాకుండా గ్రామంలోని కొందరి వ్యక్తుల పేర్లు మీద పట్టా వచ్చినట్లు ఆయన పోలీసులకు తెలిపారు.దింతో తాను సాగు చేస్తున్న భూమి ఇతరుల పేర్లపై ఉండడంతో ప్రభుత్వం ద్వారా వచ్చే రైతుబంధు సైతం రావడం లేదని వాపోయారు .తన భూమి విషయంమై గతంలో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగిన,పోలీసుల చుట్టూతిరిగిన సమస్య పరిస్కారం కాలేదని దింతో సోమవారం రాత్రి పోలీస్ స్టేషన్ కు చేరుకొని తన భూ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బ్లేడుతో చేయు కోసుకున్నాడు. దింతో వెంటనే అప్రత్తమైన పోలీసులు యాదగిరిని వెంటనే అంబులెన్సు సహాయంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రి తరలిస్తుండగా ఆసుపత్రి కి వెళ్ళడానికి నిరాకరించాడు.తన భూ సమస్యకు పరిష్కారం చూపకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని ఎస్సై భార్గవ్ గౌడ్ కు తెలిపారు. దింతో ఎస్సై కల్పించుకొని తన భూ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇవ్వడంతో అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు.





## దుబ్బ రాజేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి ఆగస్టు 11 శ్రావణ సోమవారం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం బీబీపేట వాసవీ సభ్యులు కుటుంబ సమేతంగా మెదక్ జిల్లా లో గల పుణ్యక్షేత్రం చౌదర్పల్లిలో శ్రీ దుబ్బరాయేశ్వర స్వామి గారికి విశేష అభిషేకాలు చేయడం జరిగింది, తదుపరి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది మరియు వాసవి మహిళలు గాజుల వేడుకలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పబ్బా యాదగిరి, కార్యదర్శి ఆంజనేయులు కోశాధికారి శ్రీనివాసు, వాసవి క్లబ్ అధ్యక్షులు నాగభూషణం, కార్యదర్శి ఉప్పల సాయినాథ్, విశ్వ ప్రసాద్, తాటిపల్లి రమేష్, కామారెడ్డి డివిజన్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బాశెట్టి నాగేశ్వర్ మరియు ఆర్యవైశ్య సంఘం మరియు వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం విజయవంతం



భిక్కనూరు ఆగస్టు 11( ప్రజా జ్యోతి) మండల కేంద్రంలో సోమవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బిక్కనూర్ పరిధిలోగల 45 అంగన్వాడీ కేంద్రాలలో, 33 ప్రభుత్వ పాఠశాలలో ,6 ప్రైవేట్ పాఠశాలల్లో, ఒక జూనియర్ కళాశాలలో, ఒక రెసిడెన్షియల్ స్కూల్లో,ఒకటి నుండి 19 సంవత్సరాల వయసున్న పిల్లలు మొత్తం 6623 మందికి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరిగింది.90% మాత్రల పంపిణీ జరిగిందని, ఈరోజు ఇవ్వడం కుదరని పిల్లలకు మాప్ అప్ డే రోజు అనగా 18/ 8/2025 నాడు ఇవ్వడం జరుగుతుందని ,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి యమీమా తెలిపారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఉపాధ్యాయులకు, ఆరోగ్య కార్యకర్తలకు, టీచర్లకు ,ఆశా కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి

రామారెడ్డి ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలో సోమవారం వ్యవసాయ పొలం వద్ద, పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు స్థానిక పోలీస్ సిబ్బంది.పోసానిపేట్ విలేజ్ శివార్ లో రైడ్ చేయగా ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారి వద్ద నుండి19920/- రూపాయలను రికవరీ చేయడం జరిగింది.ఈ విషయం పై పోలీస్ లు కేసు నమోదు చేయడం జరిగింది.

## గుండెపోటుతో ఉద్యోగి మృతి



నాగిరెడ్డిపేట్, ఆగస్టు11( ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్న రాపర్తి సంగయ్య(43) గుండెపోటుతో మరణించినట్లు తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.మృతుడు సంగయ్య లింగంపేట్ మండలంలోని ఒంటరిపల్లి తన స్వగృహంలో ఆదివారం గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తహశీల్దార్ తెలిపారు.మృతిడికి భార్య రాజమణి, కుమారుడు కూతురు ఉందని, అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ. 20 వేల రూపాయలు అందించి కార్యాల సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నట్లు వారు తెలిపారు.

# ఉద్యమాలకు సిద్ధం అవుదాం

**-కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్..**



కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 11. (ప్రజాజ్యోతి) కామారెడ్డి లో అమరుల యాదిలో గీతన్నల సామాజిక చైతన్య యాత్ర బాగంగా జరిగిన సమావేశంలో కామారెడ్డి జిల్లా కల్లుగీత కార్మికుల సంఘం అధ్యక్షుడు వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ. కల్లుగీత వృత్తి రక్షించడానికి అనేకమంది వీరులు పోరాటం చేసి హక్కులను సాధించుకున్నారని అలాంటి హక్కులను ఈనాటి ప్రభుత్వాలు రద్దు చేయాలని చూస్తే కల్లు గీత కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి గ్రామానికి ఈత,తాటి చెట్ల పెంచుకోవడానికి పది ఎకరాల భూమిని ఇవ్వాలని ప్రతి గీత కార్మికుడికి బైక్ ఇవ్వాలని గ్రామానికి టాటా ఏసీ వెహికల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కల్లుగీత వృత్తిని నమ్ముకొని ఈరోజు రాష్ట్రంలో మూడు లక్షల మంది ఉన్నారని వృత్తిని రక్షిస్తే మూడు లక్షలతో పాటు ఇంకా ఆదనంగా మూడు లక్షల మంది గౌడ గీత కార్మికులకు దీనిపై బ్రతకడానికి అవకాశం ఉంటుందని ఇలాంటి కల్లు గీత వృత్తి తొలగించాలని అన్నారు. కేవలం మద్యం ఫ్యాక్టరీల యజమానుల కోసం ప్రభుత్వాలు లాభాల కోసం కల్లు గీత వృత్తిపై కల్తీ పేరిట దాడి చేయడం మంచి పద్ధతి కాదని కల్లు గీత వృత్తి రక్షణకై నష్టం చేయాలని చూస్తే గీత కార్మిక సంఘం పోరాటాలు సిద్ధమౌతోందని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గౌడ కల్లుగీత కార్మికులు అందరూ ఐక్యంగా వృత్తి రక్షణ పోరాటాలు కు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్,తో పాటు నాయకులు బాలా గౌడ్,శేఖర్ గౌడ్, మల్లాగౌడ్ సిద్ధగౌడ్, అంజాగౌడ్, గంగాధర్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు డబ్బులు బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్..**



కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 11. (ప్రజాజ్యోతి) కామారెడ్డి జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ లో పంపిణీలు అనర్హులకు ఇల్లు కేటాయించారని సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వర్గ సభ్యులు కొత్త నరసింహులు అన్నారు. ప్రధానంగా భిక్కనూర్ మండల కేంద్రంలో జరిగిన ఇండ్ల పంపిణీలో అనర్హులున్నారని అధికారులు రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ అర్హులకు కేటాయించకుండా అనర్హులకు ఇల్లు కేటాయించారని సోమవారం జిల్లా కలెక్టర్ కి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. స్పందించిన కలెక్టర్ హౌసింగ్ జిల్లా అధికారిని వెంటనే రీ ఎంక్వయిరీ చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ ఏ విధంగా జరిగిందో వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. భిక్కనూర్ గ్రామస్తులు అంత ఇండ్లలో ఉంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇళ్ల స్థలాల కోసం ఆందోళన పోరాటాలు కొనసాగించాలని అర్హులకు ఇవ్వకుండా ఇండ్లున్నవారికి ఉద్యోగులకు కేటాయించడం సరైంది కాదన్నారు. ప్రస్తుత కామారెడ్డి ఎమ్మెల్యే సైతం అభ్యంతరం తెలిపినట్టు ఆయన గుర్తు చేశారు. అర్హులైన పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొత్త నరసింహులు,. నాయకులు రహిమా హైమధి ది ది బేగం, పుష్ప లక్ష్మి, మంజుల, భాష, లక్ష్మి, నజియా తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణ దినోత్సవం



గాంధారి, ఆగష్టు 11(ప్రజాజ్యోతి) గాంధారి మండల కేంద్రం లో సోమవారం నులిపురుగుల నివారణ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు సాయికుమార్, గౌతమి మాట్లాడుతూ, పిల్లలు దుమ్ము, మట్టిలో ఆడటం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి చేరే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయని చెప్పారు.

ఈ మాత్రలు తీసుకోవడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, ఈ మాత్రలు ఇప్పుడు పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ ఎల్లేశం, ఏఎన్ఎం జయసుధ మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాల తనిఖీ


గాంధారి ఆగష్టు 11(ప్రజాజ్యోతి) గాంధారి మండల కేంద్రం లో ఉన్న ఎరువుల దుకాణాలను సోమవారం రోజు వ్యవసాయాధికారి రాజలింగం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు చేసిన ఎరువుల వివరాలు, విక్రయించిన ఎరువుల వివరాలు, మిగిలిన స్టాక్ వివరాలను స్టాక్ రిజిస్టర్‌లో సరిగా నమోదు చేశారా లేదా అని పరిశీలించామన్నారు. అలాగే, ఎరువుల సంచులను పరిశీలించి వాటిపై ఉన్న బ్రాండ్ పేరు, తయారీ తేదీ, గడువు తేదీ, నికర బరువు వంటి వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూశామని తెలిపారు. ఎరువులను సరిగా నిల్వ చేశారా లేదా అని కూడా తనిఖీ చేశామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే ఎరువులను విక్రయిస్తున్నారా అని పరిశీలించామని, అధిక ధరలకు ఎవరైనా విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## కంటి వైద్య శిబిరం

గాంధారి ఆగష్టు 11(ప్రజాజ్యోతి) గాంధారి మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ మాట్లాడుతూ, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. చూపు మందగించిన వారు కచ్చితంగా అద్దాలు వాడాలని సూచించారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు.



## ఘనంగా లాభనా తీజ్ ఉత్సవాలు



గాంధారి ఆగష్టు 11(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని పలు లాభనా తాండాలలో సోమవారం నాడు తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో యువతులు, మహిళలు కొత్త పట్టుచీరలు, ఆభరణాలతో పాల్గొన్నారు. లాభనా సమాజ్ నాయకులు అతిథులను సాదరంగా ఆహ్వానించారు. పండుగలో భాగంగా గ్రామస్తులు మట్టి, పుల్లలతో తీజ్ విగ్రహాన్ని తయారుచేసి, పసుపు, పూలతో అలంకరించారు. ఈ విగ్రహాన్ని తాండ నాయకుడి ఇంటి ముందు ఉంచి, మహిళలు, పురుషులు కలిసి సాంప్రదాయ పాటలకు నృత్యాలు చేశారు. తొమ్మిది రోజుల పాటు బుట్టల్లో పెంచిన గోధుమ మొలకలను పూజించడం ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండుగ సందర్భంగా నెయ్యి రోటీ, సిరా నైవేద్యంగా సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కన్యలు తమ స్వచ్ఛతకు ప్రతీకగా ఒక రోజు ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంవత్సరం కొత్తగా పెళ్లయిన మహిళలు కూడా తమ పుట్టింటికి వచ్చి వేడుకల్లో పాలుపంచుకున్నారు. లాభనా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ ఉత్సవాలు, మరుసటి రోజు తీజ్ విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేయడంతో ముగిశాయి.

## విద్యుత్ సమస్యల వేదికను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డి ఆగస్టు 11 (ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డి సబ్ డివిజన్ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నామని ఏడీఈ ప్రసాద్ రెడ్డి, విద్యుత్ ఏఈ వెంకటస్వామిలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నేడు ఈ వేదికను పట్టణంలోని వికేవి ఫంక్షన్ హాల్ లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నామని ఏడిఈ ప్రసాద్ రెడ్డి, ఏఈ వెంకట స్వామి లు తెలిపారు.కరెంట్ బిల్లులకు సంబంధించిన సమస్యలలో వోల్టేజ్ సమస్యలు, మీటర్ రీడింగ్, కొత్త కనెక్షన్లకు సంబంధించిన సమస్యలు ను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాల పరిధి లోని గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు కొరకు సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యుత్ అధికారులు ఉంటారని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## మండల విద్యాధికారికి వినతి

భిక్కనూరు ఆగస్టు 11( ప్రజా జ్యోతి) తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి రాజగంగారెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించడం జరిగిందని, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భరత్ రాజు మాట్లాడుతూ..మన ఊరు మనబడి పథకం కింద జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలకు గత ప్రభుత్వ హయాంలో జి ప్లస్ వన్ పాఠశాల భవన నిర్మాణం కోసం 90 లక్షల నిధులు మంజూరు కాగా, 30 లక్షల నిధులు మాత్రమే విడుదల చేశారు.ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల సకాలంలో నిధులు విడుదల కాక కాంట్రాక్టర్ భవన నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారని, సరిపడా తరగతి గదులు లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్య పైన మండల విద్యాధికారి రాజా గంగారెడ్డి తక్షణమే స్పందించి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డి ండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు.మండల విద్యాధికారి రాజగంగారెడ్డి ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి స్పందిస్తూ... ఎన్నోసార్లు పాఠశాల భవన నిర్మాణమై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని వాపోయారు.



# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలి

**- అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్**




రామారెడ్డి ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) ఇచ్చిన హామీ ప్రకారం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలని,వ్యవసాయ కార్మికులను విస్మరిస్తే తగిన బుద్ధిచెప్తామని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామపంచాయతీ కార్యాలయం ముందు అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) రామారెడ్డి మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తధనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మికసంఘం(ఏఐపీకేఎంఎస్) జిల్లా ఉపాధ్యక్షులు బి. కిశోర్,మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలో భాగంగా భూమిలేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని హామీ హామీ ఇచ్చి విస్మరించారని, మాట నిలబెట్టుకోకుంటే తగిన బుద్ధి చెప్తాం అని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) జిల్లా కోశాధికారి. యస్. కిషోర్ (ఏఐయు కేవస్.) కోశాధికారి వెంకన్న మండలనాయకులు.కే.గోపాల్,సాయిబాబా, గ్రామ కమిటీ సభ్యులు,రాజేష్, కల్పనా,శేశికళ,బలరాం, రాజనారసు,బి. రాజు, నారాయణ,దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.




## నులి పురుగుల నివారణ కార్యక్రమం

రామారెడ్డి ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలోని నులి జాతీయ పురుగుల విజయవంతంగా నిర్వహించడం జరిగిందని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. ఇందులో భాగంగా 5562 మంది పిల్లలకు మందులు పంపిణీ చేయాల్సింది ఉండగా ప్రస్తుతం 4996 మంది పిల్లలకు మందులు వేయడం జరిగింది. సుమారు 90 శాతం పూర్తయిందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

**వ్యవసాయ అధికారి నదిమొద్దిన్**



ఎల్లారెడ్డి ఆగస్టు-11(ప్రజా జ్యోతిరైతు బీమాకు దరఖాస్తులు చేసుకోవాలని ఎల్లారెడ్డి వ్యవసాయ అధికారి నదిమొద్దిన్ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జూన్ మాసంలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఇప్పటివరకు రైతు బీమా కొరకు దరఖాస్తు చేయని రైతులు ఆగస్టు 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. అంతేకాకుండా ఇంతకుముందు రైతు బీమా దరఖాస్తు చేసుకున్న రైతులు నామిని మార్పు కొరకు కూడా ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రైతు బీమాకు కావలసిన ధ్రువపత్రాలు 1 దరఖాస్తు ఫారం, 2 రైతు పట్టా పాస్ పుస్తకం జిరాక్స్, 3 రైతు ఆధార్ కార్డు జిరాక్స్, 4 నామిని ఆధార్ కార్డు జిరాక్స్ లు రైతు బీమా పత్రానికి జతసేసి వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలి అన్నారు. ఆధార్ కార్డులో 18 నుండి 59 సంవత్సరాల వయసున్న రైతులు మాత్రమే రైతు బీమాకు అర్హులని పేర్కొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలుశిక్ష



ఆర్మూర్ ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వా రిని కౌన్సిలింగ్ చేసి కోర్టు ఎదుట హాజరపరచగా నూకల రాజు బాన్సువాడ జ్ఞానోబా ముఖేడ్ మహారాష్ట్ర పాముల శ్రావణ్ నవీపేట మత్తుంగా ప్రణయ్ కొలిపాక కి చెందిన వారిని రెండు రోజుల 2 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్, తీర్పునిచ్చారు. అని ఎస్ హెచ్ ఓ ఆర్మూర్ తెలిపినారు.

## అగ్ని ప్రమాదాలపై ఆరోగ్య సిబ్బందికి అవగాహన

ఎల్లారెడ్డి, ఆగస్టు 11,(ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డి పేట్ పల్లె దవాఖానలో సోమవారం ఎల్లారెడ్డి అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణ పట్ల ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ మెన్ ప్రవీణ్, హెూం గార్డు హరిబాబుతో కలిసి అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, మంటలు ఎలా ఆర్పి అదుపులోకి తీసుకు రావాలి , అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బంది కి ప్రత్యక్షంగా డెమో ద్వారా చూపించి, అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన ఎం ఎల్ హెచ్ పి శివకృష్ణ, ఎ ఎన్ ఎం లు లలిత, స్వరూప, ఆశా వర్కర్లు విజయ లక్ష్మీ, సుజాత, సాయవ్వ, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## 13న ఇందిరమ్మ ఇండ్ల మహా మార్కింగ్ మేళా




కమ్మర్ పల్లి ఆగస్టు11, ప్రజా జ్యోతి. కమ్మర్పల్లి మండల పరిషత్ కార్యాలయంలో 13 న ఇందిరమ్మ ఇండ్ల మహా మార్కింగ్ మేళా నిర్వహించడం జరుగు తుందని మండల ప్రత్యేక అధికారి తీర్మాల్ ప్రసాద్ తెలిపారు. గ్రామ వారీగా అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల స్థల లను గుర్తించి, మార్కింగ్ పనులు పూర్తి చేయడం వంటి అంశాలపై చర్చించారు.గ్రామాల వారీగా సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, సర్వేయర్లు పాల్గొని ప్రస్తుత పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో పనులు పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి అని సూచించారు.ఈ సమావేశంలోఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాద్,ఎంపీవో సదా శివ్, గ్రామాల కార్యదర్శి లు, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ సిబ్బంది,మంత్రాణి, అరవింద్, ఇంజినీరింగ్ విభాగం , సిబ్బంది హాజరయ్యారు.

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కు వ్యతిరేకంగా పోరాటం

ఆర్మూర్ ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) ఆర్మూర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆర్మూర్ డివిజన్ మాల మహానాడు ఆధ్వర్యంలో మాల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు మాదరి రాజన్న ట్రెజరర్ పులి గంగాధర్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శెట్టిపల్లి నారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు పింజా పెద్ద భోజన్న,ఎం కోటేశ్వరరావు,చిట్టిమాల నగేష్ లు పాల్గొని 1997 ఆగస్టు 11న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట ఉద్యమంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ,ల వీరోచిత పోరాట స్ఫూర్తిని కొనియాడి వారికి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది అనంతరం డివిజన్ ప్రెసిడెంట్ మాధరి రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం ప్రకారం మాల మాల అనుబంధ కులలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని, ఎస్సీ వర్గీకరణ వల్ల కేవలం ఒక కులానికి మాత్రమే న్యాయం జరిగి మిగతా ఎస్సి కులాలకు పూర్తిగా అన్యాయనికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు రొడ్డ సాయన్న తలారి సుదర్శన్ నర్సయ్య జీవన్ అంగరి ప్రదీప్ లు పాల్గొన్నారు.





# వర్షం కోసం వరుణ యాగం

సిరికొండ ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) సిరికొండ మండల కేంద్రంలో వరుణ యాగం చేసిన వీడిసి కమిటీ సభ్యులు వర్షాలు బాగా కురవాలని సిరికొండ గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, వర్షాలు కురవాలని కోరుతూ సిరికొండ ప్రజలు వరుణ యాగాన్ని చేశారు. వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల కోసం, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ విడిసి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు నీటితో అభిషేకం చేశారు. గ్రామదేవతలైన పెద్దమ్మ, లొంక రామస్వామి, పోత లింగన్న, చిన్న హనుమాన్, పెద్ద హనుమాన్, పోచమ్మ తల్లి అని పెల్లి తల్లి, తదితర దేవతలకు జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీడిసి చైర్మన్ ఇందూరు స్వామి, వైస్ చైర్మన్ ఎదురుగట్ల రామస్వామి గౌడ్, క్యాషియర్ సోప్పరి బాలయ్య, ప్రధాన కార్యదర్శి కట్టాజి గంగాధర్, రైటర్ వాల్గోట్ సాయికుమార్, సలహాదారులు ఈర పెద్దబాబులు అవధూత మోహన్, కమిటీ సభ్యులు తాళ్ల రాజలింగం చెరుకుపల్లి భూమిరెడ్డి, పిప్పెర సంజీవ్, ఆకునూరి రమేష్, అన్నలదేవి రాజేశ్వర్, కాసుల కుమ్మరి లక్ష్మణ్, బోయిడి పురుషోత్తం, కాదశి గంగవ్వ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాల అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ఆర్మూర్ ఆగస్టు 11 (ప్రజాజ్యోతి) ఆలూర్ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో ఎస్సీ రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంలో దివంగత నేత మాన్యశ్రీ పివి రావు,ఇచ్చిన చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో లక్షలాదిమంది మాలలు పాల్గొని హైదరాబాద్ ను అష్టదిగ్బంధనం చేశారు.ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాలల చైతన్యాన్ని, మాలల తిరుగుబాటును,చూసి దిక్కుతోచక అదిరిపోయి బెదిరిపోయి మాలల మీద ఉక్కుపాదం మోపినారు.గుర్రాలతో తొక్కించి ముళ్ళకంచెలు వేసి భాష్ప వాయు ప్రయోగించి లాటి చార్జీ చేయించగా పానంగి శేషయ్య గోప తొట్టి నారాయణ ప్రాణాలను కోల్పోయారు.పివి రావు,ఎంకే భీమారావు, గిడ్ల పరంజ్యోతి రావు, జి చెన్నయ్య తీవ్రంగా గాయపడిద్దరు. అని ఆలూరు మాల మహానాడు మండల అధ్యక్షుడు అగ్గు క్రాంతి, అన్నారు.ఇట్టి కార్యక్రమం లో మాల మహానాడు నిజామాబాదు జిల్లా జాయింట్ సెక్రటరీ,ఆలూర్ మండల ప్రధాన కార్యదర్శి చిట్టీ బాబూ, కోశాధికారి పిట్ల శోభన్,జాన్ బంజ పెండ భస్కర్, హరీష్ శేఖర్ భోజ అరుణ్ ప్రదీప్ వినయ్, మాల మహానాడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సిరికొండ స్కూల్ చౌరస్తాలో హైమాస్ట్ లైట్ ఏర్పాటు

సిరికొండ ఆగస్టు 11( ప్రజా జ్యోతి) సిరికొండ స్కూల్ చౌరస్తాలో హైమస్ లైక్ ఏర్పాటు. సిరికొండ మండల కేంద్రం లో ఎంపీ ధర్మపురి అరవింద్ నిధులతో హైమస్ లైట్ స్కూల్ చౌరస్తాలో ఏర్పాటు చేయడం జరిగింది. బిజెపి మండల సీనియర్ నాయకుడు తాళ్ల శ్రీనివాస్ ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అరవింద్ కు బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారికి కృతజ్ఞతలు తెలిపారు. సిరికొండ మండలానికి వివిధ గ్రామాలలో హైమస్ లైట్ ఏర్పాటు చేయడం జరిగిందని అలాగే మునుముందు సిరికొండ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆశిస్తున్నామని శ్రీనివాస్ అన్నారు. ప్రధాన కార్యదర్శి ధర్పల్లి బాబురావు మాట్లాడుతూ.. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తారని బిజెపి తరఫున మేము హామీ ఇస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇందూరు స్వామి మాట్లాడుతూ సిరికొండను అన్ని విధాల ఆదుకోవాలని ఆయన ఎంపీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు తాళ్ల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ధర్పల్లి బాబురావు వీడిసి చైర్మన్ ఇందూరు స్వామి అయినాల ఒడ్డెన్న, సూర్యనిడ గోపి, బచ్చు మారుతి, వావిలాల అజయ్, గ్యామ మోహన్, మాద రాజేందర్, డాక్టర్ కిరణ్, కట్టాజి శ్రీనివాస్, కమ్మరి నర్సయ్య, మాద రాజేశ్వర్ చిట్యాల రమేష్, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.








## చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని అభినందించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి/ నల్లవెల్లి,ఆగష్టు 11. గత ప్రభుత్వంలో కెసిఆర్ చేపట్టిన పథకాలు అన్నింటిలో అవినీతి ఉందని, కెసిఆర్ కుటుంబం మొత్తం త్వరలో జైలుకు వెళుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ఇందల్వాయి నల్లవెల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక సహకార సంఘ భవనాన్ని సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రారంభించారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని, ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని గత ప్రభుత్వం కేసీఆర్ ఆయంలో అప్పుల పాలు చేసిందని, వారు ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో అవినీతి జరిగిందని, ప్రతి పథకంలో ఎంక్వయిరీ జరుగుతుందని అన్నారు, త్వరలో కేసీఆర్ కుటుంబం జైలుకు వెళుతుందని, టిఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవుతుందని, అందులో ఉన్న నాయకులు బిజెపి కాంగ్రెస్ వైపు చూస్తున్నారని అన్నారు, ఎమ్మెల్సీ కవిత బీసీ నినాదం ఎత్తుకొని రోడ్ల పైన ధర్నాలు చేస్తుందని, బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా అని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత, కెసిఆర్ కలిసి రాష్ట్రాన్ని దోచుకున్నారని తెలిపారు. బిజెపి పాలిస్తున్న 15 రాష్ట్రాలలో సన్నబియ్యం పథకం లేదని, మరి బిజెపి పాలిస్తున్న రాష్ట్రాల్లో సమ బియ్యం పథకం ఎందుకు పెట్టలేదని అన్నారు. బీజేపీ ఎంపీలు బండి సంజయ్ అరవింద్ ఈటెల 42 శాతం బీసీ రిజర్వేషన్కు అనుకూలమా, వ్యతిరేకమ బీసీ కు చెప్పాలని నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి నూతనంగా నిర్మించిన ప్రారంభించారు. నల్లవెల్లిలోని ఎల్లమ్మ మందిరానికి శంకుస్థాపన చేయడం జరిగింది. అలాగే తాండాలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, సేవాలాల్ మహారాజ్ మందిరాన్ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ డి సి సి బ్యాంక్ చైర్మన్ రమేష్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, నల్లవెల్లి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డిప్పల్లి బ్లాక్ కాంగ్రెస్ కొనసాని శ్రీనివాస్, డిచ్పల్లి సొసైటీ అధ్యక్షులు రామచంద్ర గౌడ్, నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్ పై కలెక్టర్ కు ఫిర్యాదు

సిరికొండ ఆగస్టు 11 (ప్రజా జ్యోతి) సిరికొండ మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్ దాదాపు 30 నుండి 40 సంవత్సరాల మధ్య ఏర్పడ్డ ఈ హాస్టల్ ఈరోజు మూతబడ్డది దీనికి కారణం ఎవరు అధికారుల, ఉపాధ్యాయుల, ఉండడానికి విద్యార్థులు లేఖన మూతపడడానికి కారణం ఏమిటి? సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కు ఎమ్మార్పీఎఫ్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల వసతి గృహం మూతబడిన విషయమై వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ హాస్టల్ మూతబడిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా హాస్టల్ తిరిగి ప్రారంభిస్తే హాస్టల్లో పిల్లలు చేర్చడానికి మా సహకారం ఉంటుందని అలాగే వసతి గృహాన్ని తిరిగి ప్రారంభించాలని కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సిరికొండ మండల అధ్యక్షుడు మొట్టల దీపక్, ధర్పల్లి మండల అధ్యక్షుడు నక్క రాజేందర్, జిల్లా కార్యదర్శి ఆకారం రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# పాఠశాలకు బెంచీల అందజేత

రెంజల్, ఆగష్టు 11(ప్రజాజ్యోతి ): రెంజల్ మండల కేంద్రంలోని నీలా జెడ్పిహెచ్ఎస్ పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త దయానంద రెడ్డి 25 బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ నీలా జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడి చొరువుతో దయానంద రెడ్డికి పాఠశాల యొక్క స్థితిగతులను తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దయానంద రెడ్డి వెంటనే స్పందించి పాఠశాలకు 25 బెంచ్ లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయనకు పాఠశాల మరియు గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఆనంద్ ఉపాధ్యాయులు ప్రవీణ్, సిరాజోద్దిన్, అనిల్ అపర్ణ, లావణ్య, లక్ష్మి, సుధారాణి, ప్రతాప్, ఉమేష్, సాయి బాబా,మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజా జ్యోతి: సోమవారం ఆగస్టు 11 ఇందూర్ నగరం : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిజామాబాదు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతు ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో బాధపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 121 మందికి 35,62,000 రూపాల విలువ గల చెక్కులను సోమవారం పంపిణి చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, అత్యవసర ఆరోగ్య అవసరాలకు సీఎం సహాయ నిధి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు. తన నియోజకవర్గంలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ వైద్యం పొందలేని పరిస్థితిలో ఉంటే, వారికి ఈ పథకం ద్వారా ఆదుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నాట్లు తెలిపారు.ఇప్పటి వరకు అనేకమందికి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించామని, అర్హులైన ప్రతిఒక్కరికీ సహాయం అందేలా ప్రయత్నిస్తామని ఆయన తెలిపారు. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల విషయంలో ఎటువంటి జాప్యం లేకుండా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి అప్లై చేసుకున్న ప్రతి లబ్ధిదారుని దరఖాస్తులను సెక్రటరేట్ కి పంపించడం జరుగుతుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అప్లై చేసుకున్న మొత్తంలో 15%, 20% మాత్రమే చెల్లిస్తుందని లక్షల్లో ఖర్చు ఉంటే 15వేలు, 20వేలు ఇస్తే సామాన్యులకు చికిత్స ఖర్చు ఆర్థిక భారంగా మారుతుందని అన్నారు. బాధితులు అప్లై చేసుకున్న మొత్తంలో 50% ప్రభుత్వం చెల్లించేల చర్యలు తీసుకోవలని డిమాండ్ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకానికి మంగళం పాడిందని అన్నారు మహిళకు 2500,తులం బంగారం, ఎలక్ట్రికల్ స్కూటీలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు,మండల అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# కాశీ విశ్వనాథునికి మహా రుద్రాభిషేకం

ప్రజా జ్యోతి: సోమవారం ఆగస్టు 11. ఇందూర్ నగరం : ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో సోమవారం మార్వాడిగల్లీలోని తన నివాసంలో శ్రావణ మాస పర్వదినాన్ని పురస్కరించుకొని కాశీ విశ్వనాథునికి భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. పుణ్య కార్యక్రమంలో పది మంది ప్రముఖ వేద పండితులు పాల్గొని, శాస్త్రోక్తంగా మహాదేవునికి గంగాజలంతో, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతు " ఇందూర్ జిల్లా ప్రజల ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధి మరియు లోక కళ్యాణం కోసం ఈ రుద్రాభిషేకాన్ని గత 50 ఏళ్లనుండి నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆధ్యాత్మిక దైవ కార్యక్రమాలు నిర్వహించడం వలన మన సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించడంతో పాటు మనశాంతి, దృఢ సంకల్పం కలుగుతుందన్నారు. మహాదేవుని ఆశీస్సులతో సమాజం శాంతిగా, సుసంపన్నంగా ఉండాలని ప్రజలకు మంచి జరగాలని మనసారా కోరుకున్నట్లు తెలిపారు. వేద ఘోషల నడుమ ఎంతో ఆధ్యాత్మికతతో సాగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.